## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కేరళలో పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.
- భారత్, ఐరోపా సమాఖ్య మధ్య బంధం బలోపేతం కావడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ముప్పు తప్పుతుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు.
- జార్ఖండ్‌లోని శారందా అటవీ ప్రాంతంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు మరణించారు.
- జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి సంతాపం వ్యక్తం చేశారు.
- రానున్న 24 గంటల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్, గిల్గిత్, బాల్టిస్థాన్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు కేరళలో పర్యటించనున్నారు. రాజధాని తిరువనంతపురం వేదికగా రైల్వే, పట్టణ జీవనోపాధి, శాస్త్ర సాంకేతికత, అత్యాధునిక వైద్యం సహా పలు రంగాలకు చెందిన కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేయనున్నారు. ప్రధాని నాలుగు కొత్త రైలు సర్వీసులనుఈ సందర్భంగా ప్రారంభిస్తారు. పట్టణ ప్రాంతాల్లోని వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూతనిచ్చే `పీఎం స్వనిధి` క్రెడిట్ కార్డును నరేంద్ర మోదీ ఆవిష్కరించనున్నారు. శ్రీచిత్ర తిరునాళ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ విద్యా సంస్థలో అత్యంత సంక్లిష్టమైన మెదడు వ్యాధులకు చికిత్స అందించే అత్యాధునిక `రేడియో సర్జరీ సెంటర్`కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. తిరువనంతపురంలో `CSIR-NIIST ఇన్నోవేషన్, టెక్నాలజీ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ హబ్` నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఐరోపా సమాఖ్య (EU) మధ్య బంధం బలోపేతం కావడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పొంచి ఉన్న ముప్పు తప్పుతుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో ఈరోజు ఐరోపా సమాఖ్య దేశాల రాయబారులతో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అస్థిరత, అనిశ్చితి పరిస్థితులను ఎదుర్కోవడంలో ఇరు పక్షాల సహకారం ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో అస్థిరత సాధారణం అయిపోయిందని జైశంకర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పటిష్టమైన సరఫరా వ్యవస్థలు (Resilient Supply Chains), రక్షణ, వాణిజ్యం విషయంలో భారత్-ఈయూ భాగస్వామ్యం ప్రపంచానికి భరోసానిస్తుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కశ్మీర్‌లోని డోడా జిల్లాలో ఈరోజు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. భదేర్వా-చంబా అంతర్రాష్ట్ర రహదారిపై సుమారు 9 వేల అడుగుల ఎత్తులో ఉన్న `ఖన్నీ టాప్` వద్ద సైనికులతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న సైన్యం, పోలీసులు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కశ్మీర్‌లోని డోడా జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భారత సైనికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం ప్రకటించారు. డోడా జిల్లాలో జరిగిన ప్రమాదంలో మన సైనికులు మరణించడం తీవ్రంగా కలిచివేసిందని, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఘటనపై స్పందిస్తూ.. అమర సైనికుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. దేశం కోసం ఆ వీర జవాన్లు చేసిన సేవలను భారత్ ఎప్పటికీ మరువదమి పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో యావత్ దేశం సాయుధ దళాలకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తుందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. క్షతగాత్రులకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సమూల మార్పులు చేపట్టడంలో జరుగుతున్న జాప్యంపై `జీ-4` దేశాలు (భారత్, బ్రెజిల్, జర్మనీ, జపాన్) తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మండలిని పునర్వ్యవస్థీకరించడంలో అలసత్వం ప్రదర్శిస్తే ప్రపంచవ్యాప్తంగా మరిన్ని ప్రాణనష్టాలు, మానవీయ సంక్షోభాలు తప్పవని హెచ్చరించాయి. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన అంతర ప్రభుత్వ చర్చల (IGN) సందర్భంగా జీ4 తరపున భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా రగులుతున్న యుద్ధాలను, ఘర్షణలను అరికట్టడంలో భద్రతా మండలి విఫలమవుతోందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్భూం జిల్లా శారందా అటవీ ప్రాంతంలో ఈరోజు భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు మరణించారు. శారందా అడవుల్లోని జరైకెలా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు మోహరించారన్న నిఘా సమాచారంతో సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టారు. భద్రతా దళాలు అడవిలోకి ప్రవేశించగానే మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని, ప్రతిగా జవాన్లు జరిపిన కాల్పుల్లో 15 మంది మరణించారని అధికారులు వెల్లడించారు. మృతుల్లో నిషేధిత సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు పతిరామ్ మాంఝీ అలియాస్ `అనల్` ఉన్నట్లు పోలీసులు ధ్రువీకరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (WEF) సదస్సులో పాల్గొన్న ఆయన.. నరేంద్ర మోదీని తన `సన్నిహిత మిత్రుడు`గా అభివర్ణించారు. భారత్, అమెరికాల మధ్య నెలకొన్న వాణిజ్య ప్రతిష్టంభన త్వరలోనే తొలగిపోతుందని, ఇరు దేశాల మధ్య ఒక చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. భారత్‌తో తాము త్వరలోనే ఒక అద్భుతమైన ఒప్పందాన్ని కుదుర్చుకోబోతున్నామని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పాలనా యంత్రాంగం 'ప్రగతి' మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ వేదిక 50వ సమావేశాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. 2015లో ప్రారంభమైన ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్.. ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచడమే కాకుండా, ఏళ్ల తరబడి నిలిచిపోయిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మోక్షం కల్పించడంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రగతి సమీక్షల వల్ల ఒక ప్రాజెక్టు ఎలా త్వరితగతిన పూర్తవుతుందనే దానికి అహ్మదాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ (ఫేజ్-1) ఒక గొప్ప ఉదాహరణ. సుమారు 12 వేల 924.5 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఈ 40 కిలోమీటర్ల ప్రాజెక్టు ప్రయాణంలో 'ప్రగతి' కీలక పాత్ర పోషించింది. ఏప్రిల్ 25, 2018న ఈ ప్రాజెక్టును ప్రధాని తొలిసారి సమీక్షించినప్పుడు కేవలం 25 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. భూసేకరణ, పునరావాసం, నిధుల సర్దుబాటు వంటి సమస్యలు ప్రధానమంత్రి నేరుగా పర్యవేక్షించడంతో తొలగిపోయాయి. 2020 నాటికి పనులు 62 శాతానికి చేరుకున్నాయి. నరేంద్రమోదీ ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో గుజరాత్ ప్రభుత్వం భూసేకరణ పనులను వేగవంతం చేసింది. ఫలితంగా.. 2022 సెప్టెంబర్ 30న మెట్రో ఫేజ్-1లోని ప్రధాన మార్గాలను ప్రధాని ప్రారంభించగా, ప్రస్తుతం పూర్తిస్థాయి నెట్‌వర్క్ అహ్మదాబాద్ వాసులకు సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 24 గంటల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్, గిల్గిత్, బాల్టిస్థాన్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లతో పాటు జమ్మూ కశ్మీర్ పరిసర ప్రాంతాల్లో రేపటి వరకు పిడుగులు పడే అవకాశం ఉందని, గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎండీ శాస్త్రవేత్త వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ

బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =